గేడా రంగారావు

నాగ కనకదుర్గా బుక్ సెంటర్
రామచంద్రరావుపేట, ఏలూరు

అజ్ఞాతవాసం!

అజీజ్

"అమ్మాయిగారు పొద్దున్నే ముద్దుగా తయారవుతున్నారు. ఎక్కడికో?" అన్నారు వారు నన్ను సమీపిస్తూ.

"ఈ రోజు మధ్యాహ్నం ఓ ఫ్రెండు ఇంటికెళ్ళాలి. ఈ లంకంత ఇంట్లో రోజంతా ఒకర్తినీ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడం నావల్ల కాదు బాబూ! మీకేం ఉదయమనగా వెళ్ళి సాయంత్రం ఏ ఆరింటికో తిరిగొస్తారు" అన్నాను జడలో మల్లెచెండు తురుముకుంటూ.

బ్లౌజుకీ, చీరకీ మధ్య వున్న నా శరీరాన్ని మృదువుగా స్పృశిస్తూ నడుం చుట్టూ చెయ్యివేసి, "ఎంత బావున్నావో తెలుసా?" అన్నారు మత్తుగా.

నా నరాలన్నీ ఝల్లుమన్నాయి తియ్యగా. వారి స్పర్శ

తగిలితే అంతే! అదేం మాయో మరి! ఒళ్ళంతా తంత్రులు మీటినట్టూ, మనసు దూదిపింజగా మారి గగనంలోకి ఎగిసినట్టూ అనుభూతి కలుగుతుంది.

వారు నా గుండ్రని భుజాలమీద చేతులు వేసి తనవైపు తిప్పుకుంటోంటే మరబొమ్మలా తిరిగేను.

"ఇన్నాళ్ళూ నా రీసెర్చిలో అవిరామంగా మునిగి తేలుతూ, నిద్రాహారాలు మాని పాటుపడ్డ నా శ్రమ చివరికి విజయవంతంగా ముగిసింది. ఆ రీసెర్చి తాలూకు కోడ్ స్క్రిప్టు షేర్ చేసి కంపెనీవారికి అందివ్వడం మాత్రం మిగిలింది. అదేమంత రిస్కు వర్కు కాదు.

ఈ రోజుతో సగం పని పూర్తవుతుంది. రేపు మిగతా సగం కానిచ్చి కొన్నాళ్ళు సులభంగా ఏ కాశ్మీర్కో చెక్కేద్దాం!'' అంటూ రెండు చేతుల్లో నా మొహం దగ్గరికి లాక్కుని గట్టిగా పెదాలు బిగించేరు.

కళ్ళు మూసుకున్నాను. తన్మయత్వం. చిత్రమైన తన్మయత్వం అది.

అంతటితో వారి చేతులు ఊరుకోడంలేదు. మెల్లిగా వీపు నిమురుతూ బ్లౌజు బటన్స్ విప్పడానికి ప్రయత్నిస్తున్నారు.

"అబ్బ! ఊరుకోండి! దేనికైనా వేళాపాళా ఉండాలి!'' అంటూ అతికష్టంమీద విడిపించుకున్నాను.

వారి కళ్ళల్లో చిలిపితనం చిందులు తొక్కుతోంది. నా బుగ్గమీద చిటికవేసి, టై కట్టుకుంటూ సోఫాలో చతికిలబడ్డారు. "ఈ రోజు ఏ బూట్లు తొడుక్కుంటానో?'' అడిగేను షూ రాక్ వైపు నడుస్తూ.

రకరకాల జోళ్ళతో రాక్ నిండు చూలాలిలా ఉంది.

"ఆ బ్లాక్ బెల్ పట్రా!"

"అయ్యో, నా మతి మండిపోయింది! బ్రౌన్ షూ పాలిష్ జేసేనండీ!"

"ఆఁ, ఏదో ఒకటి కానిద్దూ!"

జోళ్ళూ, మేజోళ్ళూ అందుకుని వారి కాళ్ళదగ్గర కూర్చున్నాను.

"దేనికిలా రోజూ శ్రమపడతావ్? ఆమాత్రం నేను తొడుక్కోని విప్పుకోలేనూ?" అని వారించబోయేరు.

"మీరు తొడుక్కోనూ గలరు, విప్పుకోనూ గలరు. ఆ పనేదో నా చేత్తో చేస్తే నాకెంత తృప్తిగా, ఆనందంగా ఉంటుందో మీకేం తెలుసు?" అన్నాను కాళ్ళకి మేజోళ్ళు తొడిగిస్తూ.

వారు తయారయ్యేక ఇద్దరం కలిసి డైనింగ్ హాల్లో కెళ్ళాం. బ్రేక్‌ఫాస్ట్ కానిచ్చి, చివరిసారి నా పెదాలు తడిపి, సెలవు తీసుకుని, కారెక్కి వెళ్ళిపోయేరు.

ఆయన కనుమరుగయ్యేవరకూ గుమ్మంలో చూస్తూ నిల్చుని తలుపు మూసేను. మళ్ళీ ఒంటరితనం! ఇంట్లో వంటమనిషి ఫూల్‌చంద్ ఉన్నా, అతని పనేదో అతనిది. కిచన్ వదిలి ఇవతలికి రాడు.

అంతక్రితం బసంతీ అనే వంటలక్క ఉండేది. తన పనేదో అటు చేసుకుంటూనే, ఇటు నాతో వసపిట్టలా వాగుతుండేది. రోజు ఎలా దొర్లిపోయేదో తెలిసేదికాదు.

ఈమధ్య ఏవో కారణాలు చెప్పి పని మానుకుంది. ఈ ఢిల్లీ నగరంలో పనిమనుషులు అంత త్వరగా దొరకరు. వంటమనిషి కావాలని స్థానిక ఏజెన్సీకి కబురుపెడితే ఈ ఫూల్‌చంద్ వచ్చి చేరేను.

మెల్లెక్కి పైకెళ్తూ రిస్ట్‌వాచీ చూసుకున్నాను. తొమ్మిదిన్నర.

నా జీవితం ఇటువంటి మధురమైన మలుపు తిరుగుతుందనీ, ఒక గొప్ప వ్యక్తికి అర్ధాంగినవుతాననీ, ఇలా నిశ్చింతగా ఏ లోటూ లేకుండా జీవిస్తాననీ ఎన్నడూ అనుకోలేదు. అంతా కలలోలాగా అనూహ్యంగా జరిగిపోయింది.

పెళ్ళికి పూర్వం టెలివిజన్లు తయారుచేసే ఓ పెద్ద కంపెనీలో స్టెనోగా పనిచేసేదాన్ని. ఒక రోజు ఏదో పని మీద అక్కడికి వచ్చేరు వారు. అప్పుడు పరిచయం ఏర్పడింది మా మధ్య.

ఆ పరిచయమే క్రమేపీ స్నేహమై, ఆ స్నేహం కాస్తా హృదయస్పందనై, వివాహబంధనంలో శాశ్వత రూపు దాల్చింది. శాంతారామ్ అనబడే ఓ పారిశ్రామికవేత్త తాలూకు ప్రైవేట్ లేబొరేటరీలో పనిజేస్తున్నారు వారు. ఈ ఇల్లూ, ఇంట్లోని ఫర్నిచరూ వగైరా అన్నీ ఆ కంపెనీ సమకూర్చినవే.

ఆ లేబొరేటరీలో అమూల్యమైన ఒక ఫార్ములాకోసం పరిశోధన సాగిస్తున్నారు వారు. అడపాదడపా వారే చెబుతుంటారు దాని గురించి. మసిబొగ్గులోనూ, వజ్రంలోనూ ఉండే మూలపదార్థాన్ని కార్బన్ అంటారు.

ఆర్టిఫిషియల్ డైమండ్స్ తయారుచెయ్యడానికి ఇదివరకొందరో ప్రయత్నించేరుట. అది చాలా ఖర్చుతో కూడుకున్న పనిట. పదార్థాలను క్రిస్టల్ స్ట్రక్చర్ గా మార్చడానికే వారేదో ప్రయోగం చేస్తున్నారు. అది ఫలిస్తే, పదివేల రూపాయలు విలువజేసే వజ్రాన్ని సుమారు ఐదు వందల ఖర్చుతో తయారుచెయ్యవచ్చుట!

ఆ రీసెర్చి ముగిసింది గనక కంపెనీ వారికి పెద్ద మొత్తం ఇవ్వబోతోంది. ఆ డబ్బుతో కొన్నాళ్ళు ఏ కాశ్మీర్‌లోనో ప్రశాంతంగా రెస్టు తీసుకోవాలనుకుంటున్నారు వారు.

బెడ్‌రూంలో టెలిఫోన్ గణగణ మ్రోగడంతో గబగబ వెళ్ళి రిసీవర్ అందుకున్నాను.

"సారథిగారేనా?" అవతలినించి పలికింది మగకంఠం.

"కాదు. వారి భార్య కృపాలిని!"

"వారెక్కడ?"

"ఇప్పుడే వెళ్ళేరు లేబొరేటరీకి. మీరెవరు?"

అవతల నిశ్శబ్దం!

"హలో! హలో!!"

ఠపీమని రిసీవర్ దించిన చప్పుడు.

నివ్వెరబోయేను!

అవతలి వ్యక్తి మర్యాదస్తుడై వుంటే ఇలా ప్రవర్తించడు.

"అమ్మగారూ!"అన్న పిలుపువిని తలుపువైపు చూసేను. వంటమనిషి ఫూల్‌చంద్.

"ఏమిటి?"

"లంచ్‌లో ఏం చెయ్యమంటారు?"

కాగితంమీద వారికీ, నాకూ ఇష్టమైన విజిటేరియన్ ఐటమ్స్ రాసిచ్చేను. వారానికి సరిపడే కూరగాయాలూ అవీ ఫ్రిజ్‌లో ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.

స్లిప్ అందుకుని వెళ్ళిపోయేడు ఫూల్‌చంద్.

2

సాయంత్రం వారు వచ్చేవేళకి గుమ్మంలో నిల్చుని ఎదురుచూడటం అలవాటైపోయింది నాకు. ఆ ఆరాటం

ఎందుకో స్పష్టంగా చెప్పలేను మరి. ఆయన ఎంత త్వరగా ఇంటికి వస్తే అంత ఆహ్లాదంగా వుంటుంది మనసు.

ఒకటిరెండుసార్లు బాగా చీకటిపడేవరకూ గుమ్మం లోంచి కదలకుండా కాచుకున్న సంఘటనలూ ఉన్నాయి.

సరిగ్గా ఆరుంబావుకి కార్లో హడావుడిగా వచ్చారు. "తయారైవున్నావన్నమాట. వెరీ గుడ్!" అన్నారు లోనికి వస్తూ.

"దేనికండీ ఈ హడావుడి?" అడిగాను అర్థంకాక.

"శ్రీ స్క్వేర్‌లో ఓ కొత్త ఇంగ్లీష్ పిక్చర్ రిలీజైంది. మనకోసం రెండు టికెట్స్ రిజర్వ్ చేసాను. త్వరగా లెములు మరి. అట్టే టైంలేదు" అన్నారు తొందర పెడుతూ.

సినిమా కెళ్ళి చాలా రోజులైంది. ఆదరాబాదరా కాఫీలు తాగి, తిరిగి వచ్చి భోంచేస్తామని, మేల్కొనే వుండమని ఫూల్‌చంద్‌తో చెప్పి కారెక్కాం.

"రీసెర్చ్ తాలూకు కోడ్ స్క్రిప్టు ఫేర్ చెయ్యడం సగం పూర్తయింది. ఈనాటికి నా శ్రమ ఫలించింది. ప్రపంచంలో ఎవ్వరూ కనుక్కోలేని ఒక అమూల్య విషయాన్ని శోధించి సాధించాను. ఇహ జీవితాంతం కాలూ చెయ్యీ కదపకుండా నిశ్చింతగా బ్రతకవచ్చు.

కొద్దిరోజుల్లో అన్ని ఏర్పాట్లూ చూసుకుని ఓ శుభ ముహూర్తాన వజ్రాలు తయారుచెయ్యడం ప్రారంభిస్తారు. లాభాల్లో పాతిక శాతం వాటా నాకు వచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాను" అంటున్నారు వారు కారు తోలుతూ.

సడన్‌గా జ్ఞాపకం వచ్చింది, ఉదయం ఎవ్వరో అనామకుడు ఫోన్ చెయ్యడం, పేరు అడిగేసరికి ఫోన్ పెట్టెయ్యడం.

అదే చెప్పేను వారికి.

"రోజూ ఎందరో ఫోన్ చేస్తుంటారు స్నేహితులు! తొందర్లో ఉన్నాడేమో, నీ మాటలు పట్టించుకోకుండా లైన్ కట్ చేసేడు" అన్నారు ఆయన నవ్వుతూ.

థియేటర్ ఇంటికి చేరువలోనే ఉంది. సినిమా చాలా బావుంది. నా అభిమాన నటుడు క్లింట్ ఈస్ట్‌వుడ్ నటించిన 'హేంగ్ హిమ్ హై' చిత్రం అది.

ఇంటర్వెల్లో వారు లేచి బైటికెళ్తూ_ "ఏమైనా తీసుకురావాలా?" అడిగేరు.

"చిప్స్!" అన్నాను నవ్వుతూ.

చిప్స్ నవుల్తూ పిక్చర్ చూడ్డం బావుంటుంది. ఇంటర్వెల్ తర్వాత వచ్చేరు వారు. మొత్తానికి చాల రోజులకి మంచి రిలీఫ్ లభించింది ఈ చిత్రం ద్వారా.

పిక్చర్ పూర్తయ్యేక పదినిముషాల్లో ఇల్లు చేరాం. తలుపు మూసి వుంది. పోర్టికోలో కారాపి, డోర్స్ లాక్ చేస్తున్నారు వారు. ఈలోగా మెట్లెక్కి, గుమ్మానికున్న కాలింగ్ బెల్ వత్తేను. లోపల బెల్ మోగుతున్న శబ్దం లీలగా వినిపిస్తోంది.

పదినిముషాలు గడిచినా తలుపు తెరుచుకోలేదు. ఫూల్‌చంద్ నిదరబోతున్నాడా యేం? మరో మారు వత్తేను బెల్. ఓపిక నశిస్తోంది మాకు. కడుపులో ఎలుకలు పొర్లుతున్నాయి మరి.

"నిదురపోయాడో ఏమో!" అన్నారు వారు.

గట్టిగా తలుపు తట్టాలని చెయ్యి వేసేను. కిర్రుమంటూ తెరుచుకుంది. ఒకరి మొహాలొకరం చూసుకున్నాం.

"లక్షసార్లు చెప్పేను. రాత్రివేళ గడియవెయ్యకుండా

వదలొద్దని. జాగ్రత్తగా ఉండమని" ముఖం చిట్లిస్తూ లోనికి నడిచేను.

నా వెనకే వారూ వచ్చి, బట్టలు మార్చుకోడానికి పైకెళ్ళేరు.

"ఫూల్ చంద్!" పిల్చేను.

ఇల్లంతా నిశ్శబ్దం!

ఈసారి కాస్త గట్టిగా పిల్చేను.

జవాబు లేదు.

ఎక్కడికెళ్ళాడు చెప్మా, అనుకుంటూ వంటింటివైపు నడిచేను. వంటింటి తలుపు దగ్గరగా వేసివుంది. చిన్న శబ్దం జేస్తూ తెరుచుకుంది.

లోపల చీకటి!

కోపంతో నాకు కళ్ళు మండిపోతోంది. గోడ తడిమి లైటు వేసేను. నేలమీద కనిపించిన దృశ్యం చూసి కెవ్వుమన్నాను.

ఫూల్ చంద్ వెల్లికిలా పడున్నాడు. సరిగ్గా అతని ఛాతీ మధ్య రంధ్రం. అది పిస్తోలు గుండు చేసిన రంధ్రం! చొక్కామీద కల్లాపి చల్లినట్లు ఇంకిన రక్తం. కళ్ళు తెరిచి గది కప్పు చూస్తున్నట్టు పడున్నాడు. నోరు సగం తెరిచి వుంది.

గొంతు బొంగురు బోయేలా, పిచ్చిదానిలా, గావు కేకలు పెడుతూ మేడమీదికి పరిగెత్తేను.

అప్పటికే నా కేకలు విని_ "ఏం జరిగింది కృపా?" అంటూ గది బైటికి రాబోతున్నారు వారు కంగారుగా.

భయంతో నా నోరు పెగలడం లేదు. ఫిట్స్ వచ్చిన రోగిలా వణుకుతూ ఆయన ఛాతీమీద వాలిపోయేను.

"ఏం జరిగింది కృపా? దేనికలా వణుకుతున్నావ్? ఫూల్‌చంద్ ఎక్కడ?" అడుగుతున్నారు వారు నా వీపు చరుస్తూ.

అతికష్టంమీద నోరు విప్పి చెప్పగలిగేను చూసిన దృశ్యం. ఆశ్చర్యంతో ఆయన కళ్ళు పెద్దవయ్యేయి. అమాంతం నన్ను తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టి_ "మనింట్లో హత్య జరగడమేమిటి? నువ్వేదో భ్రమ పడుంటావ్. ఇక్కడే కూర్చో. నేవెళ్ళి చూస్తాను!" అంటూ నన్ను ఒంటరిగా అక్కడే వదిలి వెళ్ళేరు.

కొద్ది సేపటికి తిరిగి వచ్చి_ "నువ్వు చూసిందంతా నిజమేనా?" అడిగేరు అనుమానంగా.

"అదేమిటి?" అన్నాను నివ్వెరబోతూ.

"ఐతే శవం ఏది అక్కడ?"

"శవం లేదా?" అడిగేను దిమ్మెరపోయి.

"శవం లేదూ చచ్చుబండలూ లేవు. అనవసరంగా భ్రమపడ్డావ్."

నాకు నమ్మశక్యం గావడంలేదు.

"నా మాటమీద నమ్మకం లేకుంటే, రా చూద్దువు గాని!" అంటూ నన్ను వెంటబెట్టుకుని కిందికి తీసికెళ్ళేరు.

వంటింట్లో కెళ్ళి చూడగానే, నా కళ్ళల్లో నింగీ నేలా గిరగిర తిరగసాగేయి. కనీసం నేలమీద చిన్న రక్తపు మరకకూడా కనిపించటంలేదు.

ఏమిటీ మాయ?

వారు భుజం తడుతూ_ "పద!" అన్నారు.

"మరి ఫూల్‌చంద్ ఏమయ్యేడు?" అడిగేను అయోమయంగా.

"ఎక్కడికో వెళ్ళుంటాడు. వస్తాడులే. పద!" అంటూ నన్ను పైకి తీసుకెళ్ళి- "కాసేపు రెస్టు తీసుకో!" అన్నారు.

"దేనికైనా మంచిది. ఓసారి పోలీసులకి ఫోన్ చేసి పిలిపించండి" అన్నాను వణుకుతూ.

"పిచ్చిదానా! వాళ్ళని పిలిపించడానికి కారణమంటూ ఏదైనా ఉండాలిగా? తెల్లారేలోగా, ఫూల్‌చంద్ రాకుంటే అప్పుడాలోచిద్దాం! ముందు భోంచేసి శుభ్రంగా నిదరపో!"

"నాకాకలిగా లేదు. మీరు తినండి."

"నువ్వు లేకుండా నేనొక్కణ్ణే తినాలా? బావుంది. చెరో గ్లాసు పాలు తాగి పడుకుందాం" అని పాలల్లో ఓవల్టిన్ కలిపి ఓ గ్లాసు అందించేరు.

కళ్ళు మూసుకుని గట గట తాగేను కషాయంలా. వారు ఇంటి తలుపులు మూసి, లైటార్పి పక్కన చేరేరు. నా కళ్ళముందు మాత్రం ఆ దృశ్యమే గిర గిర తిరుగుతోంది. నేను నిజంగా భ్రమపడ్డానా? ఐతే ఫూల్‌చంద్ ఏమయ్యేడు? ఎక్కడికెళ్ళేడు?

ఆలోచిస్తూ అలాగే నిదరలోకి జారుకున్నాను.

3

ఉదయం చాలా పొద్దెక్కాక నిదర లేచాం ఇద్దరం. లేవగానే ఆదరాబాదరా మంచం దిగి ఇల్లంతా వెతికేను ఫూల్‌చంద్ కోసం. ఆవిరి గాలిలో అదృశ్యమైనట్టు జాడ లేకుండా ఉన్నాడతను.

"నాకంతా అయోమయంగా ఉంది. దేనికైనా మంచిది వెళ్ళి పోలీసులకి జరిగిందంతా తెలియజెయ్యండి"

అన్నాను వారితో. గబ గబ స్నానం అదీ జేసి, తయారై, కాంప్లిమెంట్లతో టిఫిన్ కానిచ్చి వెళ్ళిపోయేరు.

పడగ్గదిలో తలుపులు బిగించుకుని కూర్చున్నాను భయంతో. ఆ ఇంట్లో తిరగడానికి చచ్చేంత భయంగా ఉంది.

సరిగ్గా పదిగంటలకి కాలింగ్ బెల్ మోగింది.

వారే అయుంటారనుకుని కిందికెళ్ళి హాలు తలుపు తెరిచేను.

పేపర్ కుర్రాడు!

పేపర్‌తో బాటు ఓ కవర్ చేతికిస్తూ— "గేటుగుండా మీ ఇంట్లోకి వస్తుంటే ఓ వ్యక్తి అడ్డుపడి ఈ ఉత్తరం మీ ఇంట్లో ఇవ్వమన్నారు" అన్నాడు.

కవర్ మీద కేవలం వారి పేరుమాత్రం రాసి వుంది. గమ్‌తో ఓపెన్ ప్లేస్ అతికించి లేదు! లోపల మడత పెట్టిన ఎర్రని కాగితం కనిపిస్తోంది.

కుర్రాణ్ణి వెళ్ళమని, తలుపు మూసి, కవర్లోంచి ఆ కాగితం తీస్తూ సోఫాలో కూలబడ్డాను. ఇంగ్లీషులో టైప్ జేసిన ఉత్తరం అది.

"మిస్టర్ సారథీ!

చాలా రోజుల్నుంచి మా మనుషులు నీమీద ఓ కన్నేసి ఉన్నారు. ఇన్నాళ్ళూ నీవు ఆ లాబొరేటరీలో దేనిమీద పరిశోధన సాగిస్తున్నావో మాకు తెలుసు. ఆ విషయం ఇతర్లెవ్వరికీ తెలియకుండా మీరెన్ని జాగ్రత్తలు పడ్డా లాభం లేకపోయింది.

అవిరామంగా కృషి జేస్తూ ఎట్టకేలకి ఈ మధ్యే నీ లక్ష్యాన్ని సాధించేవు. కంగ్రాచ్యులేషన్స్! ఇక్కడ నా

దాక చిన్న విస్మపం. మొక్క నాటి, నీరు పోసి, పెంచి పెద్దజేసి, దాని ఫలాన్ని తను తినకుండా ఇతర్లకి పంచి పెట్టడం అర్థంలేని పని.

నీ మేధస్సునంతా ధారపోసి కనుగొన్న ఆ అమూల్య ఫార్ములాని, ముందే కోట్లతో తులుతుతున్న శాంతారాం కెందుకిస్తావ్? మాకు తెలుసు. నీవు పేద కుటుంబంలో పుట్టి, స్వయంకృషితో ఇంతవాడివయ్యావని.

మాతో చేతులు కలుపు. వజ్రాలు తయారుజెయ్యడానికి కావలసిన యంత్రసామగ్రి సొంతం మేము ఏర్పాటు జేస్తాం. వచ్చేదాంట్లో ఇద్దరం ఫిఫ్టీ ఫిఫ్టీ! కొద్ది రోజుల్లోనే నీవు శాంతారాంని తలదన్నే కుబేరుడివైపోతావ్.

లేనిపోని ఆదర్శాలకి పోయి మా అభ్యర్థన తృణీకరిస్తే నీకే నష్టం. మేము అనుకున్నది సాధించేవరకు నిదరపోము. దురదృష్టశాత్తూ మేం కోరింది మాకు దక్కకపోతే దాన్ని మీకూ దక్కనివ్వం!

బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి రా. ఒకరోజు గడువిస్తున్నాను. నీ నిర్ణయం తెలుసుకోడానికి సరిగ్గా రేపు రాత్రి ఏడుగంటలకి ఫోన్ జేస్తాను. నీవు సరేనంటే, సంప్రదింపులకోసం మనం ఎక్కడ కలుసుకోవాలో తెలియ జేస్తాను.

అనాలోచితంగా నిన్న రాత్రి మావల్ల చిన్న పొరపాటు జరిగిపోయింది. ఆ ఫార్ములా లేబొరేటరీలో ఉంచకుండా నీ దగ్గరే ఇంట్లోనే ఉంచుకుంటావనుకుని, నీవూ నీ భార్యా సినిమాకెళ్ళాక మీ ఇంట్లో ప్రవేశించాం.

ఫార్ములాకోసం వెదుకుతుంటే మీ నౌఖరు చూసి అడ్డు పడ్డాడు. వాణ్ణి కాల్చిపారేసి ఇల్లంతా వెతికాం. మా శ్రమ

వృధా అయింది. వెళ్ళిపోదామనుకుంటుండగా మీరు సినిమానుంచి వచ్చేరు. ఇంట్లో నక్కిదాక్కున్నాం. నీ భార్య నాఖరు శవం చూసి పైకి పరిగెత్తగానే శవాన్ని మోసుకు పారిపోయాం.

నీ భవిష్యత్తు సగం నీ చేతిలో, సగం మా చేతిలో ఉంది. అతి తెలివికిపోయి మా ఆగ్రహానికి గురికాక. తరవాత చింతించి నిష్ప్రయోజనం. ఇట్లు

ఎర్ర దీపం!"

నా గుండెల్లో గుర్రాలు దౌడు తీసేయి. సన్నగా జ్వరం వచ్చినట్టు వళ్ళు వేడెక్కుతోంది. నిశ్చలంగా, ప్రశాంతంగా ఉన్న నీటిలో గులకరాయి పడ్డట్టు మనసంతా అల్లకల్లోలమయింది.

క్షణం ఆలస్యం చెయ్యకుండా వారికి ఫోన్ చేసి, తక్షణం ఇంటికి రమ్మని చెప్పేను.

అరగంట తర్వాత హడావుడిగా వచ్చి "మళ్ళీ ఏం జరిగింది?" అన్నారు.

వణికే చేత్తో ఉత్తరం అందించేను.

చదివి తెల్లబోయేరు. "ఇలాంటి విపత్తు ఏదో ముంచుకు వస్తుందనే నా ప్రయోగాన్ని అతిరహస్యంగా కొనసాగించేను. ఐనా, ఎవ్వరికో తెలిసిపోయిందన్నమాట. ఇదేదో ఇంటర్నేషనల్ ముఠా అయుంటుంది. ఉండు, ఇప్పుడే కాంతారాంగారితో మాట్లాడి వస్తాను."

నేనేదో చెప్పబోతుండగానే, వచ్చినంత వేగంగా వెళ్ళిపోయేరు. ప్రాణాలర చేతిలో పెట్టుకుని, నిమిషాలు లెక్క పెడుతూ కూర్చున్నాను.

సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో తిరిగివచ్చి-

"కృపా! ముఖ్యమైన సామాన్లేవో ప్యాక్ చేసి వెంటనే తయారవు. శాంతారాం గారితో మాట్లాడేను. మూడో కంటికి తెలీకుండా మనం ఢిల్లీనించి జారుకుని కొన్నాళ్ళు ఏ మారుమూలో అజ్ఞాతంగా గడపమని సలహా ఇచ్చేరు.

ఆ ముఠావాళ్ళు నాకోసం ఢిల్లీ అంతా గాలించి, విసిగి నా సంగతి మరిచేక, రహస్యంగా తిరిగి వచ్చి నా కార్య కలాపాలు కొనసాగించమన్నారు.

ఆ ముఠావాళ్ళకి బెదిరి, ఇన్నాళ్ళూ నన్ను పోషించి ఆదరించే నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్న శాంతారాం గారికి నమ్మకద్రోహం చెయ్యలేను. ఈ సంగతి చెప్పగానే ఆయన మన రక్షణకోసం క్షణాల్లో అన్ని ఏర్పాట్లూ చేసేరు. రాత్రి తొమ్మిదింబావుకి కలకత్తా వెళ్ళే ప్లేన్లో మనకోసం రెండు సీట్లు బుక్ అయి సిద్ధంగా ఉన్నాయి.

కలకత్తా చేరగానే ఏదైనా ఇల్లు చూసుకుని, శాంతారాంగార్నించి మెసేజ్ అందేవరకూ గోప్యంగా ఉందాం. ఆలోగా ఆయన ఆ ముఠా సంగతేమిటో కను క్కుంటారు. త్వరగా తెములు మరి!" అన్నారు తొందర పెడుతూ.

నా మస్తిష్కం ఆలోచించే ఓపిక కోల్పోయింది. ఆదరాబాదరా కావలసిన బట్టలూ, నిత్యావసర వస్తు వులూ సూట్ కేసుల్లో సర్ది గబగబ తయారయ్యేను.

వారుకూడా ఏవో కాగితాలూ, రెండు మూడు ఫైళ్లూ బ్రీఫ్ కేస్లో సర్దుకున్నారు. తరవాత ఇంటికి తాళంవేసి ఇద్దరం కార్లో కూర్చున్నాం.

4

రెండు మూడు వీధులు తిప్పి, పెద్ద హోటల్ ముందు ఆపేరు కారు. "వెర్రిదానిలా దిక్కులు చూస్తూ కూర్చోక!

త్వరగా పద!'' అన్నారు సామానందుకుంటూ.

ఇద్దరం హోటల్లోకెళ్ళాం.

వారు కౌంటర్ క్లర్క్‌తో మాట్లాడి, ఏదో తీసుకుని, లిఫ్ట్ వైపు నడిచేరు. మరబొమ్మలా ఆయన్ని అనుసరించేను.

నాలుగో అంతస్థులో లిఫ్ట్ ఆగగానే నన్ను రమ్మన్నట్టు సైగచేసి, నడవాకిరుపక్కలా వున్న రూం నెంబర్స్ చెక్ చేసుకుంటూ వెళ్ళి ఓ గదిముందు ఆగేము. తలుపు మూసి ఉంది. జేబులోంచి కీ తీసి, తాళం తెరిచి—''రా'' అన్నారు లోనికి నడుస్తూ.

నేను లోనికెళ్ళగానే తిరిగి డోర్ మూసేరు. సరిగ్గా అదే క్షణంలో, లోపల బెడ్ రూం తలుపు తెరుచుకుంది. అందులోంచి ఇవతలికి వస్తున్న ఇద్దరు స్త్రీ పురుషుల్ని చూసి కొయ్యబారిపోయేను.

ఆ వ్యక్తి అచ్చు మా వారిలాగే వున్నాడు. ఆ స్త్రీ ముమ్మూర్తులా నాలాగే వుంది. అద్దంలో నన్ను నేను చూసుకుంటున్నానా అనిపించింది క్షణంపాటు. ఏమిటీ గారడీ?

''హలో మిస్టర్ సారథీ! మీ కోసమే ఎదురు చూస్తున్నాం. సమయానికి వచ్చేరు. ఇహ మమ్మల్ని వెళ్ళ మంటారా?'' అంటున్నాడతను మా వార్ని చూస్తూ.

ఆ యువతి నన్ను సమీపించి— ''మమ్మల్ని చూసి నిర్ఘాంతబోతున్నారా?'' అంది నవ్వుతూ.

అప్పుడు గమనించేను. వాళ్ళ రూపాలు మావే అయినా కంఠాలు మావి కావని.

వారు నా వైపు తిరిగి నవ్వి- ''మనం ఇంటినుంచి బైలు దేరితే ఎవ్వరైనా మనల్ని వెంబడించి, మనం ఎక్కడి

కళ్ళామో కనుక్కుంటారని శాంతారాంగారే ఈ ఏర్పాటు చేశారు.

మన వేషాల్లో వీరు బైటికెళ్ళి మనం వచ్చిన కార్లో వెళ్ళిపోతారు. నిజంగా ఎవ్వరైనా మనల్ని వెంబడించి ఇక్కడికి వచ్చివుంటే, వీళ్ళని ఫాలోజేస్తూ వెళ్ళి పోతారు. అప్పుడు మనం మారువేషాల్లో టాక్సీ ఎక్కి ఏర్‌పోర్ట్ చేరుకుందాం,'' అన్నారు.

ఈ ఏర్పాటు నాకు నచ్చింది,

''సరే, మీరు వెళ్ళండి,'' అన్నారు వారు వాళ్ళని.

ఇద్దరూ వెళ్ళిపోయేరు.

తిరిగి తలుపుమూసి—''రా యిలా!'' అంటూ పడగ్గది లోకి నడిచేరు వారు. అక్కడ మా కోసం మారువేషాలు సిద్ధంగా వున్నాయి. ముస్లిం స్త్రీలు వేసుకునే బురఖా తీసిస్తూ- ''ఇది తొడుక్కుని ముఖం దాచుకో'' అన్నారు.

తంటాలుపడి ఎలాగో తొడుక్కున్నాను.

వారు గడ్డం, మీసాలు అతికించుకుని, కళ్ళకి తెల్ల కళ్ళద్దాలు పెట్టుకున్నారు. తలమీద కుచ్చు టోపీ పెట్టు కుని మనిషి దాదాపు మారిపోయారు.

ఇద్దరం సామానులతో తిరిగి హోటల్లోంచి బైటపడి, ఓ టాక్సీని ఎక్కి ఏర్‌పోర్ట్ చేరుకున్నాం. కలకత్తా వెళ్లే విమానం ఎక్కేక గానీ మనసు కుదుటపడలేదు.

పదిన్నరకి విమానం వెళ్ళబోతున్నట్టు ఎనౌన్స్ జేసేడు పైలెట్. కావలసినంత ఎత్తు ఎగిరేక బెల్టులు తీసి వెయ్యవచ్చని చెప్పింది ఏర్‌హోస్టెస్, మైక్‌లో.

''నిద్రవస్తే నా భుజంమీద తలపెట్టుకు పడుకో!'' అన్నారు వారు.

ఇటువంటి పరిస్థితిలో ఇహ నిద్ర కూడానా?

విమానంలో ఒక్క సీటు కూడా ఖాళీ లేకుండా ప్రయాణీకులతో నిండివుంది. అనాలోచితంగా పక్క వరుసలోని ప్రయాణీకుల్ని చూస్తూ కూర్చున్నాను.

సరిగ్గా మాకు కాస్త వెనక ఓ సీట్లో ఉన్న వ్యక్తి మీద దృష్టి పడగానే ఉలిక్కిపడ్డాను. అంతవరకూ అతను మమ్మల్నే గమనిస్తున్నవాడల్లా నేనటు చూడగానే చటుక్కున తల తిప్పుకున్నాడు.

నా ఉలికిపాటుకి కారణం లేకపోలేదు. అంతక్రితం ఏర్‌పోర్ట్‌లో విమానం ఎక్కకముందు మేమిద్దరం కాంటీన్‌లో కూర్చుని కాఫీ, టిఫిన్‌లు తీసుకున్నాం. అప్పుడే గమనించేను. ఈ వ్యక్తి మాకాస్త దూరంలో కూర్చుని మమ్మల్నే గమనిస్తుండటం. అప్పుడంతగా పట్టించుకోలేదు. కాని, ఇప్పుడు దేనికో మనసు కీడును శంకిస్తోంది.

పక్కవాళ్ళకి వినిపించకుండా, మావారివైపు ఒదిగి, రహస్యంగా చెప్పేను అతని గురించి.

ఆయన కాసేపాగి, తల కొద్దిగా తిప్పి, ఓరగా అతన్ని చూసేరు. "మనం ఇంత జాగ్రత్తపడ్డాక, ఎవ్వరో మనల్ని వెంబడిస్తున్నాడంటే నేన్నమ్మను. అనవసరంగా భయపడుతూ మనసు పాడుచేసుకోక!" అన్నారు తేలిగ్గా తీసిపారేస్తూ.

నేను పలకలేదు.

విమానం రెండు మూడు నగరాల్లో దిగుతూ, ఎగురుతూ తెల్లవారుజాము ఆరుగంటలకి కలకత్తా చేరింది.

సామానుతో సరాసరి ఓ హోటల్ చేరుకున్నాం.

దాన్లో ఆ వ్యక్తి మమ్మల్ని వెంబడిస్తున్నాడేమోనని జాగ్రత్తగా గమనించేను. అతను ఎక్కడా కనిపించలేదు.

5

హోటల్లో ఓ సింగిల్ రూం తీసుకుని, మారు వేషాలు తీసేసి శుభ్రంగా స్నానం అదీ కానిచ్చి, కాఫీ టిఫిన్లు తెప్పించుకు తిన్నాం.

వారు సోఫాలో కూర్చుని ఏవో కాగితాలు చూసుకుంటున్నారు.

కిటికీ గుండా బైటి దృశ్యాలు చూద్దామని, కిటికీవైపు నడిచేను. దూర దూరంవరకూ ఎటు చూసినా ఎత్తయిన మేడలూ మిద్దెలూ కనిపిస్తున్నాయి. కింద హోటల్ ముందు విశాలమైన రోడ్ వుంది. వచ్చేపోయే జనంతో, వాహనాలతో చాలా రద్దీగా ఉంది.

సరిగ్గా రోడ్ కవతలివైపు ఓ రెస్టారెంట్ కనిపిస్తోంది. అందులో కూర్చున్న సగం జనం ఇక్కణ్నుంచి స్పష్టంగా కనిపిస్తున్నారు. సడన్ గా నా దృష్టి ఓ కుర్చీలో కూర్చున్న వ్యక్తిమీద పడగానే అదిరిపడ్డాను.

అతనే!

అంతక్రితం విమానంలో కనిపించిన వ్యక్తి! సిగరెట్ కాలుస్తూ అప్పుడప్పుడూ తలెత్తి హోటల్ వైపు చూస్తున్నాడు.

"ఏమండీ!" అన్నాను దాదాపు అరుస్తూ.

"ఏం జరిగింది?" అంటూ వచ్చేరు కంగారుగా.

వేలితో చూపించి– "అతన్నెక్కడైనా చూసేరేమో జ్ఞాపకం చేసుకోండి" అన్నాను.

వారి కళ్ళు పెద్దవయ్యేయి. "విమానంలో నీవు చూపించిన వ్యక్తే కదూ?" అన్నారు ఆశ్చర్యంగా.

"ఔను. అతనే!"

వారు పలకలేదు. మునిపంటితో పెదవి నొక్కిపట్టి కాసేపు ఏదో ఆలోచించి సాలోచనగా తలూపేరు. "వీడెవడో ఇప్పుడే తేల్చుకుందాం! పద" అన్నారు అద్దంవైపు నడుస్తూ.

"మళ్ళీ బురఖా వేసుకోనా? నావల్ల కాదు బాబూ!" అన్నాను.

"నీకు మారువేషం అక్కర్లేదు. ఇలాగే పద!" అంటూ గబగబ గడ్డం మీసాలు అతికించుకోసాగేరు.

తరవాత గది లాక్ చేసి ఇద్దరం కిందికెళ్ళాం.

"వీధిలో నా వెంట నడుస్తూ, అప్పుడప్పుడు ఓరగా అతను మనల్ని ఫాలో అవుతున్నాడేమో గమనించాలి. దాంతో, శత్రువులు ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేవారనీ, ఢిల్లీనించి మనల్ని వెంబడిస్తూ ఇక్కడివరకూ వచ్చేరనీ, ఎన్ని ఎత్తులు వేసినా వాళ్ళముందు చిత్తు కావలసిందేననీ స్పష్టంగా తెలిసిపోతుంది" అన్నారు వారు.

చిన్నగా తలూపేను.

ఇద్దరం వీధిలో పడి నడవసాగాం.

కొద్దిదూరం వెళ్ళేక ఓరగా వెనక్కి చూసేను. నా అనుమానమే నిజమైంది. కొద్ది దూరంలో అతను మా వెనకే వస్తున్నాడు. చెప్పేను వారికి. సాలోచనగా తలూపేరు.

ఇంకాస్త దూరం వెళ్ళేక మరో మారు చూసేను. నా గుండె వేగం అందుకుంది. జేబుల్లో చేతులు పెట్టుకుని, రోడ్డుమీది జనంలో మేమెక్కడ తప్పిపోతామో అన్నట్టు నిశితంగా మమ్మల్నే చూస్తూ వస్తున్నాడు.

"సందేహంలేదు. అతను శత్రుపక్షం మనిషే. రా ఇలా!" అంటూ ఓ ఫోటోగ్రాఫిక్ గూడ్స్ డీలర్

దుకాణం వైపు నడిచేరు వారు. ఏంచేస్తారో చూద్దామన్న క్యూరియాసిటీతో అనుసరించేను. ఆ షాప్‌లో రకరకాల కెమెరాలూ, ఫోటోగ్రఫీ కవసరమయ్యే అన్ని వస్తువులూ దొరుకుతాయి.

వారు ఓ కెమెరా, ఫిల్మ్ తీసుకుని, గబగబ ఫిల్మ్ కెమెరాలో ఎక్కించేశారు. "వీధిలో నడుస్తూ ఓ చోట ఫోటో తీసుకుంటున్నట్టు ఫోజ్ పెట్టి నిలో్చ. నీ ఫోటోలో ఆ వ్యక్తి కూడా పడేటట్టు స్నాప్ తీస్తాను. ఈ సిటీలో నాకు తెలిసిన ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వున్నాడు. ఆ ఫోటో ఎన్‌లార్జ్ చేసి, అతని సహాయంతో వీడు అంతు చూస్తాను," అన్నారు.

"త్వరగా ఏదో ఒకటిచేసి వీడి పీడ విరగడ జెయ్యండి. ఏ ఆపద తెచ్చిపెడతాడో ఏమో?" అన్నాను భయంగా.

షాప్‌లోంచి బైటికెళ్తూ తలతిప్పి చూశాను. ఆ వ్యక్తి కొద్ది దూరంలో టెలిఫోన్ స్తంభాని కానుకుని నిలుచున్నాడు ఫుట్‌పాత్ మీద. ఇద్దరం మళ్ళీ ముందుకి సాగాం.

వారు చెప్పినట్టు, ఫోటో తీసుకోడానికనుకూలంగా ఉన్న ఓ చోట ఫోజుపెట్టి నిలుచున్నాను. వారు కెమెరాలోంచి ఏంగిల్స్ చూసుకుంటూ క్లిక్‌మనిపించేరు.

ఇద్దరం తిరిగి నడక సాగించాం.

"ఫోటోలో వాడూ పడ్డాడా?" అడిగేను మెల్లిగా.

ఆయన తలూపి– "ఏదైనా స్టూడియోలో ఈ ఫిల్మ్ కడిగించి, కాపీలు తీయించి టాక్సీలో ఇన్‌స్పెక్టర్ దగ్గరికెళ్తాను. నీవు కాసేపు అక్కడక్కడా తిరిగి హోటల్ వెళ్ళిపో!" అన్నారు.

ఆయన్ని ఒంటరిగా వదలడానికి మనస్కొప్పడం లేదు. చేసేది లేక తలూపేను.

కొద్దిదూరం వెంట నడిచి, ఓ టాక్సీ ఆపి ఎక్కి వెళ్ళిపోయేరు. నేను వెంటనే పక్కనున్న ఓ ఫాన్సీషాప్‌లో దూరి, ద్వారం పక్క నక్కి ఆ వ్యక్తి చర్యలు గమనించసాగేను.

రోడ్డు పక్క ఆగివున్న టాక్సీ దగ్గర ఒంగి డ్రైవర్‌తో ఏదో అంటున్నాడు. తరవాత బాక్ డోర్ తెరిచి లోన కూర్చున్నాడు. ఆ టాక్సీ స్టార్టయి, వారు వెళ్ళినవైపు పరిగెత్తింది.

దానిలాగే నా గుండెలూ ఉరకలు వేసేయి భయంతో. ఆ షాప్‌లో నాకొక్కవసిన కాస్మోటిక్ ఐటమ్స్ రెండు మూడు కొని, కొన్ని గంటలు అక్కడక్కడా తిరిగి కాలి నడకనే హోటల్‌కి బైలుదేరేను.

లిఫ్ట్‌ద్వారా పైకెళ్ళి రూం చేరుకున్నాను. పర్సులోంచి తాళంచెవి తీసి లాక్ తెరిచేను. తలుపు తోసి లోనికెళ్ళి తిరిగి మూసేను. బాగా తిరగడంవల్ల చమటపోసి చటపట మంటోంది.

వారెప్పుడు తిరిగొస్తారో ఏమో! ఈలోగా కాస్త చన్నీళ్ళు పోసుకుంటే మనసు తేలిక పడుతుంది - అనుకుంటూ టవల్, సోప్ అందుకుని బాత్‌రూంవైపు నడిచి, తలుపు తోసేను.

లోన అడుగు పెట్టి భయంతో గావుకేక పెట్టేను. బాతింగ్ టబ్‌లో, నీళ్ళ మధ్య కూర్చుకుంది ఓ ఆకారం. ఫుల్ సూటు. మెడలో టై. సరిగ్గా గుండెదగ్గిర రంధ్రం! ఆ రంధ్రం గుండా కారి టబ్‌లోని నీళ్ళను ఎర్రగా

మార్చిన రక్తం! కళ్ళు మూతలు పడున్నాయి. చేతులు రెండూ అకుకూర కాడల్లా టబ్ కిరుపక్కలా వేలాడుతున్నాయి.

అతనెవ్వరో కాదు.

అంతక్రితం మమ్మల్ని వెంబడించిన వ్యక్తి!

ఇక్కడికెలా వచ్చేడు? ఎవ్వరు చంపేరు?

6

నా కాళ్ళూ చేతులూ వేపాకులా గజగజ వణుకుతున్నాయి. హోటల్ వాళ్ళకి మా గదిలో ఓ శవం వుందని తెలిస్తే ఏం గొడవ ముంచుకొస్తుందో? ఏదిఏమైనా, వారు వచ్చేవరకూ కింద రిసెప్షన్ లో కూర్చోడం ఉత్తమం.

అనుకుంటూ గభాల్న బాత్ రూం తలుపు మూసి గదిలోంచి బైటపడ్డాను. తలుపుకి తాళం వేసి, లిఫ్ట్‌లో కింది కెళ్ళి, ఓ సోఫాలో చతికిలబడ్డాను. అక్కణ్నించి హోటల్లోకి వచ్చే పోయే జనం కనిపిస్తున్నారు.

తల భారంగా ఉంది. మస్తిష్కం ఆలోచనా రహితమై మొద్దుబారిపోయింది. ఎక్కువసేపు కాచుకునే అవసరం లేకుండా, అరగంటలోనే వారు హోటల్లో ప్రవేశించేరు.

అంతకిముందు నిండుగా వున్న ఆయన మొహం ఇప్పుడు వాడిపోయి, పీక్కుపోయింది. టైఫాయిడ్ రోగిలా చాలా నీరసంగా కనిపిస్తున్నారు.

ఉన్నపళాన లేచి ఆయన దగ్గిరికెళ్ళేను.

"నువ్వెప్పుడొచ్చావ్?" అడిగేరు ఆశ్చర్యంగా.

"ఇప్పుడే..." అంటూ ఏదో చెప్పబోయేను.

ఆయన చెప్పనివ్వకుండా, "ష్!" అని వారించి, తనతో

రమ్మని సైగ చేసి లిఫ్ట్ వైపు నడిచేరు.

మౌనంగా అనుసరించేను. ఇద్దరం పైకెళ్ళి గదిని సమీపించాం. ఆయన తలుపు తెరుస్తూ— "నువ్వేం చెప్పదలచుకున్నావో నాకు తెలుసు!" అన్నారు.

"ఎలా తెలుసు?" అడిగేను నివ్వెరబోయి.

"ఆ వ్యక్తిని చంపింది నేనే!" అన్నారు గదిలో అడుగు పెడుతూ.

నా నోట మాట పెగల్లేదు.

"ఇంకా అక్కడే నిల్చున్నావేం? రా లోపలికి!" అంటూ నా చెయ్యి పట్టి లాగి తలుపు మూసేరు.

"నిన్ను బజార్లో వదిలి, నేను టాక్సీలో తిన్నగా ఓ స్టూడియోకెళ్ళాను. దార్లో సగందూరం వరకు అతను నన్ను వెంబడించేడు. నేను స్టూడియోలోకెళ్ళగానే అతని టాక్సీ వెనుదిరిగి వెళ్ళిపోయింది.

నేనా ఫోటోలు తీయించి, తిన్నగా సిటీ క్రయిం బ్రాంచికెళ్ళి నా స్నేహితుడికోసం ఆరాతీసేను. దురదృష్ట వశాత్తు అతను రెండు రోజులక్రితం ఏదో ఇన్వెష్టిగేషన్‌లో దూనాపూర్ వెళ్ళేడని తెలిసింది.

చేసేది లేక హోటల్ చేరుకున్నాను. గది తాళం తీసివుంది. నువ్వే వచ్చివుంటావనుకుని కాలింగ్ బెల్ వత్తేను. లోపల తలుపు గడియ తీసిన చప్పుడయింది.

తోసి లోన అడుగుపెట్టేను. అంతే. తలుపు పక్కన నక్కివున్న ఆ వ్యక్తి మెరుపులా నా మెడమీద దెబ్బ తీసేడు. నా కళ్ళల్లో చీకట్లు కమ్మేయి. కింద పడిపోకుండా నిలదొక్కుకుంటూ, అతను ఊహించని విధంగా జేబులోంచి పిస్తోలు తీసేను.

అప్పటికే అతను చిరుతలా నామీదికి లంఘించేను. కాసేపు మా మధ్య తీవ్ర పెనుగులాట జరిగింది. చివరికి నా చేతిలోని పిస్తోలు పేలి, గుండు అతని గుండెలో దిగింది.

దుప్పలా నేల కూలేడు. అప్పుడు గ్రహించేను మనం లేని అవకాశం చూసుకుని గదిలో ప్రవేశించి, సామాను వెతికి ఆ ఫార్ములా కాగితాలేవైనా దొరుకుతాయేమోనని వచ్చి ఉంటాడని. నా ఆత్మరక్షణకోసం అతన్ని కాల్చేను. అది నేరం కాదు.

కాని, ఈ సంగతి బైటికి పొక్కితే, పోలీసుల చుట్టూ కోర్టుల చుట్టూ నానాఇబ్బందులూ పడవలసి ఉంటుంది.

"ఆ వ్యక్తి శవాన్ని బాత్ రూంలో పడేసి, శాంతారాం గారికి ట్రంకాల్ చేసి మాట్లాడేను. వారిచ్చిన సలహా ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసుకు వచ్చేను.

ఐదున్నరకి ఇక్కణ్నించి జమ్మూ వెళ్ళడానికి ప్లేన్ వుంది. అందులో మనం జమ్మూ వెళ్ళిపోవాలి" అన్నారు నీరసంగా.

నేనేమీ జవాబిచ్చే స్థితిలో లేను. బైట నున్న సామాను సూట్ కేసుల్లో కుక్కి, గది ఖాళీ చెయ్యకుండానే ఇద్దరం హోటల్లోంచి బైటపడ్డాం. ఖాళీ చేస్తే హోటల్ ఉద్యోగి గదిలోకి వచ్చి తనిఖీ చేస్తాడు. అప్పుడు శవం బైట పడుతుంది. గుట్టుగా నప్పుడు కాకుండా ఇలా బైట పడితే ఏ సమస్యా వుండదు.

టాక్సీలో_వారు సీటు వెనక తల ఆనించి కళ్ళు మూసుకుని మూలుగుతున్నారు. అనుమానం వేసి, చెయ్యి అందుకుని చూసేను. జ్వరంతో ఆయన ఒళ్ళు కాలిపోతోంది. నా గుండె దడదడమంది.

జరిగిన ఒక్కొక్క సంఘటనా, ఆయనమీద దెబ్బ తీసేయి. నీరసింప చేసేయి. ఇప్పుడేమిటి దారి?

“ఏమండీ! జ్వరంతో మీ ఒళ్ళు కాలిపోతోంది. ప్రయాణం మానుకుని ఏ నర్సింగ్ హోంకైనా వెళ్దాం!” అన్నాను దిగులుగా.

ఆయన నవ్వి– “వెర్రిదానా! ఇప్పుడు మనకు డాక్టర్ కంటే, ఈ నగరంనించి అదృశ్యం కావడం ముఖ్యం. ఈ మాత్రం జ్వరానికే అలా బెంబేలు పడక!” అన్నారు.

చేసేది లేక నోరు మూసుకున్నాను.

రాత్రి రెండు గంటల ప్రాంతంలో మమ్మల్ని జమ్మూ చేర్చింది విమానం. వారి ఫీవర్ తగ్గకపోగా ఇంకా ఎక్కువయింది. ఆడపా దడపా దగ్గుతున్నారు కూడా. రొంప పట్టిందేమో?

ఎవరెస్ట్ హోటల్ చేరుకుని ఓ గది తీసుకున్నాం. వారు సూట్ కేస్ లోంచి రెండు స్లీపింగ్ టాబ్లెట్స్ తీసి వేసుకుని–“తల భారంగా ఉంది. కాస్త పట్టు!” అన్నారు మంచంమీద వాలుతూ.

తలుపు గడియవేసి, సూట్ కేస్ లోంచి విక్స్ డబ్బీ తీసేను. తెల్లవారేవరకూ డాక్టర్ సహాయం దొరికే అవకాశం లేదు. ఆలోగా వారికి తాత్కాలికోపశమనం కావాలి.

విక్స్ తో నుదురూ, గొంతూ మర్దిస్తూ పక్కన కూర్చున్నాను. హఠాత్తుగా వారికేదో జ్ఞాపకం వచ్చినట్టు, జేబులోంచి పిస్తోలు తీసి మంచం పక్క టీపాయ్ మీద పెట్టి “ఏ సమయం ఎలా వస్తుందో చెప్పలేం, ఆయుధం ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోడం మంచిది!” అన్నారు.

తలూపేను. వారు కళ్ళు మూసుకున్నారు. తలపడుతూ అలాగే కూర్చున్నారు. కాసేపటికి నిదరలోకి జారుకున్నారు. అప్పుడుగానీ నా మనసు శాంతించలేదు.

7

నేనూ కాస్త కునుకు తీద్దామని మంచంమీద వాలబోయేను. అప్పుడే, హఠాత్తుగా ఏదో శబ్దం వినిపించసాగింది. నా గుండె ఝల్లుమంది. ఊపిరి బిగబట్టి శబ్దాన్ని వింటున్నాను.

"బీప్... బీప్... బీప్..."

ఎక్కణ్ణించి వస్తోందా అని ఆశ్చర్యంగా చుట్టూ కలయజూసేను. అప్పుడు పడింది దృష్టి. ఆ శబ్దం ఎక్కణ్ణుంచో కాదు. మా వారి పాంటు జేబులోంచే వస్తోంది. ఆశ్చర్యంతో నా కళ్ళు పెద్దవయ్యాయి.

అదేమిటో చూడాలన్న క్యూరియాసిటీ కొద్దీ, వారికి నిద్రాభంగం కలక్కుండా మెల్లిగా జేబులో చెయ్యి దూర్చేను. ఏదో తగిలింది. బైటికి లాగేను.

అది సిగరెట్ కేస్!

అందులోంచే వస్తోంది శబ్దం, ఇంకా!

బైటికి కనిపిస్తున్న చిన్న బటన్‌లాటిది నొక్కేను, అనుకోకుండా!

ఓ భారీ కంఠం ఇంగ్లీష్‌లో ఏదో చెప్పసాగింది.

"మిస్టర్ అక్బరలీ!

భారత గూఢచారి విభాగం నీకోసం దేశమంతా గాలిస్తోంది. ఢిల్లీ రక్షణశాఖనించి నీవు సేకరించిన రహస్య పత్రాలు జాగ్రత్త. ఏలైతే నిన్ను చంపైనా సరే, ఆ పత్రాలు తిరిగి పొందడానికి భారత ఏజెంట్లు వలపన్నేరు.

సాధ్యమైనంత త్వరలో నీవు ఇండియా సరిహద్దులు దాటి మనదేశం చేరడానికి ప్రయత్నించు. నీవంటి గూఢ చారి ప్రాణం మనదేశానికి అమూల్యం!

దురదృష్టవశాత్తూ భారత ఏజెంట్లు నిన్ను పట్టుకుంటే నీవు చేయవలసిన పనేమిటో వేరే చెప్పనవసరంలేదు..."

ఆ కంఠం ఇంకా వినిపిస్తూనే ఉంది.

నా కళ్ళముందు లోకమంతా చీకటైపోయినట్టూ కాళ్ళకింది నేల పగిలి అందులో కూరుకుపోతున్నట్టూ భ్రాంతి కలిగింది. ఎంత విచిత్రం! ఇన్నాళ్ళూ నేను మన సారా ఆరాధిస్తున్న నా భర్త శత్రుదేశపు గూఢాచారా!

ఆ కంఠం వినిపించడం ఆగిపోయింది. నమ్మనట్టు, పడు కున్న అతనివైపు చూసేను. కళ్ళు తెరిచి నన్నే చూస్తు న్నాడు! నా నోట మాట పెగలడం లేదు.

కాసేపు రెప్ప వెయ్యకుండా నన్ను చూసి-"ఇన్నాళ్ళూ నీకేమీ తెలీకుండా జాగ్రత్తపడ్డాను. ఇప్పుడంతా తెలిసి పోయిందన్నమాట. ఇక దాచి లాభంలేదు. ఆల్ రైట్! అంతా చెప్పేస్తాను.

కృపా! నేను పాకిస్తాన్ ఇంటిలిజెన్స్ శాఖలో పేరు పొందిన గూఢచారిని. ఒక ప్రత్యేకమైన మిషన్ మీద ఈ దేశం పంపబడ్డాను.

సారథి పేరుతో ఢిల్లీలో నివసిస్తూ ఇక్కడి రక్షణశాఖ మీద నిఘా వేసేను.

గూఢచారులు ప్రేమించకూడదు. ఎంతటి అందగత్తె తటస్థపడ్డా మనసు పారవేసుకోకూడదు. మోహపాశాలూ, అప్యాయతానురాగాలూ మా వృత్తిలో చెల్లవు. అటు వంటి శిక్షణ ఇవ్వబడుతుంది మాకు.

ఐనా, మొదటిసారి నిన్ను చూడగానే నా వృత్తి ధర్మాలు వదిలి మనసు పారవేసుకున్నాను. ఎక్కడో లాబ్‌లో పనిచేస్తున్నట్టు నాటకమాడుతూ నిన్ను పెళ్ళి చేసుకున్నాను.

ప్రభుత్వానికెలాగో నామీద అనుమానం కలిగింది. ఢిల్లీలో ఫూల్‌చంద్ పేరుతో మనింట్లో చేరిన వంటవాడు ఎవ్వరో కాదు. స్పెషల్ బ్రాంచి ఏజెంట్! ఆ విధంగా మనింట్లో ఉంటూ నా చర్యలు గమనించేవాడు. చాలా రోజుల తర్వాతగానీ నేనీ సంగతి పసిగట్టలేకపోయేను.

ఆ రోజు రాత్రి మనం పిక్చర్ వెళ్ళినప్పుడు, ఇంట రైల్లో బైటకెళ్ళి కాస్త ఆలస్యంగా వచ్చేను గుర్తుందా? బైటకెళ్ళినట్టు వెళ్ళి ఇంట్లో ఫూల్‌చంద్‌ని చంపి వచ్చేను.

తరవాత నీవు వంటింట్లో వాడి శవాన్ని చూసి పైకి పరిగెత్తుకొచ్చావ్. నేను చూసి వస్తానని కిందికెళ్ళి, వాడి శవాన్ని పెరట్లో ఉన్న డ్రైనేజీలో పడేసి నిన్ను మభ్య పెట్టేను. అప్పటికే ఢిల్లీలో నా పని పూర్తయింది. ఇక నా దేశం చేరడమే మిగిలింది. నేనొక్కణ్ణి వెళ్ళదలచుకో లేదు. నీవు లేకుండా నేను బ్రతకలేనని నాకెప్పుడో తెలిసి పోయింది. నిన్ను మభ్యపెడుతూ ఎలాగైనా మా దేశం తీసికెళ్ళాలని ప్లాన్ అల్లేను.

ఎవ్వరో అనామకుడు ఫోన్ చేసినట్టు నీలో అనుమానం లేపి, పేపర్ కుర్రాడి ద్వారా ఆ ఉత్తరాన్ని నేనే పంపేను. దాంతో నీవు పూర్తిగా భ్రమలో పడ్డావ్.

అంత జాగ్రత్తపడి కలకత్తా ప్లేన్ ఎక్కినా స్పెషల్ బ్రాంచ్ ఏజెంట్ ఒకడు మనల్ని వెంబడించేడు. కలకత్తా చేరేక వీధిలో నీ ఫోటో తీసినట్టు నటించి టాక్సీలో బైలు దేరేను. మరో టాక్సీలో ఆ ఏజెంట్ నన్ను వెంబడించేడు

అతనికాక్కావలసిందల్లా హోటల్ గదిలోని మన సామాను వెతికి, రక్షణశాఖ రహస్య పత్రాలు చేజిక్కించుకుని, తరవాత నన్ను అరెస్ట్ చెయ్యడం.

అతన్ని ఫూల్ చెయ్యడానికి ఓ స్టూడియోలో దూరేను. దాంతో అతను తృప్తిపడి తిన్నగా హోటల్ వెళ్ళేడు. మారుతాళంతో మన గదిలో ప్రవేశించేడు. అతని ఎత్తులన్నీ నేను ముందే ఊహించేను. కొద్ది సేపాగి అతని వెనకే హోటల్ వెళ్ళి చంపి, బాత్ రూంలో పడేసేను.

దురదృష్టవశాత్తూ చివరి దశలో నాకిలా ఫీవర్ పట్టుకుంది. అక్కణ్ణించి మా ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రవేశించడం చాలా సులభం. కృపా! నాతో వచ్చెయ్. నిన్ను కళ్ళల్లో పెట్టుకు చూసుకుంటాను. పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. ఇన్నాళ్ళూ నిన్ను మోసం చేసినందుకు నన్ను మనస్ఫూర్తిగా క్షమించు. ప్లీజ్!'' అంటున్నాడు.

అతని మాటలేవీ నాకు స్పష్టంగా వినిపించడం లేదు. ఒళ్ళంతా తేలూ్, జైరులూ పాకసాగేయి. అలనాటి ఝాన్సీ లక్ష్మి, రుద్రమదేవి, రాణి చెన్నమ్మ లిప్తపాటు మెదిలేరు కళ్ళల్లో. అప్పుడు గుర్తుకు వచ్చింది నా కర్తవ్యం ఏమిటో?

నా మాతృభూమికి నేను ద్రోహం చెయ్యను. చెయ్యలేను. రెప్పమూసి తెరిచేలోగా మంచంమీంచి కిందికి దూకి, టీపాయ్‌మీది పిస్తోలు అందుకున్నాను.

''మిస్టర్ అక్బరలీ! జరిగిందానికి చింతించడం లేదు. మాతృదేశ గూఢచారివైన నిన్ను తుదముట్టించడానికే నా శీలాన్ని త్యజించేననుకుంటాను. నిన్ను అధికార్లకి పట్టించి నా కర్తవ్యం నెరవేర్చుకుంటాను!'' ఆవేశంతో నా గుండెలు ఎగిసి పడుతున్నాయి.

జరగబోయే ప్రమాదాన్ని అతను గ్రహించేడు. చిరుతలా నా మీదికి లంఘించబోయేడు. అంతే! ట్రిగ్గర్ వత్తేను. ఆగకుండా అలా వత్తుతూ పోయాను గుళ్ళన్నీ అయిపోయేవరకు. అతను కాండం నరికిన చెట్టులా, రక్తం కారుతున్న గాయాలతో కింద కూలేడు.

ఆరు గుళ్ళలో మూడు మిస్ అయ్యేయి. మూడు అతని శరీరంలో తిష్టవేసేయి. కిందపడి విలవిల తన్నుకుంటున్నాడు. క్షణం వృథా చెయ్యకుండా ఫోన్ వైపు పరిగెత్తి ఆపరేటర్‌తో స్థానిక పోలీస్ స్టేషన్‌కి లైన్ కలపమని చెప్పేను. లైన్ దొరగ్గానే వాళ్ళని తక్షణం బైలుదేరి రమ్మన్నాను.

పావుగంటలో హుటాహుటిన వచ్చేరు అధికారులు. అతనింకా కొన ఊపిరితో వున్నాడు. గుళ్ళు, ప్రాణం పోయే ప్రదేశాల్లో తగల్లేదు. తక్షణం అతన్ని హాస్పిటల్‌కి తరలించేరు. మా సామాను వెదికి, అతని సూట్‌కేస్ సీక్రెట్ అరలో ఉన్న రహస్య పత్రాలు స్వాధీనం చేసుకోబడ్డాయి.

ఈ విధంగా శిథిలమైంది నా జీవితం. అతన్ని నమ్మి గుడ్డిగా ప్రేమించేను. ఆరాధించేను. మోసపోయేను.

ప్రభుత్వం నా కర్తవ్యపారాయణతకి మెచ్చి, బంగారు పతకంతో సత్కరించింది.

ఈ సత్కారమూ, ఖ్యాతీ ఏం చేసుకోను? నా జీవితం బీడు వారింది. నా రంగుల హర్మ్యం పునాదులతో సహా కూలింది. ఈ లోటు ఎవ్వరూ పూడ్చలేనిది. తీర్చలేనిది. జీవితమనే సమరంలో నేను ఓడిపోయేను.

చిత్తుగా ఓడిపోయేను!

—: ఐపోయింది :—